సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శనివారం । 25 । జనవరి । 2025



భక్తులు మెచ్చుకునేలా ఏర్పాట్లు చేయాలి - 10లో▸

మేడారం సమ్మక్క, సాలరమ్మ మినీ జాతరలో భక్తులు మెచ్చుకునేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి కొండా సురేఖ అన్నారు.




పరిహారం చెల్లింపులో జాప్యమెందుకు? - 10లో▸

రోడ్డు భూ నిర్వాసిత రైతుకు పరిహారం అందించడంలోజాప్యమెందుకు జరిగిందని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రశ్నించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం $31^{0}/16^{0}$

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండగా ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.




- రెండు జిల్లాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లు 30వేల మంది అధికం
- యువఓటర్లు 19వేలు మాత్రమే
- యువ ఓటర్లలో పురుషుల సంఖ్య అధికం

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం



ఆ వయస్సు వారే..

ఓటు హక్కు.. పాలకులను నిర్ణయించే వజ్రాయుధం. ఆ హక్కును సద్వినియోగం చేసుకునే బాధ్యత ఓటర్లపై ఉంటుంది. ఓటుహక్కు నమోదు, ప్రాధాన్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఈనేపథ్యంలో ఇటీవల రాష్ట్ర ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితాను ప్రకటించింది. వరంగల్, హనుమకొండ జిల్లాలో మొత్తం ఓటర్లలో 30 నుంచి 49 ఏళ్ల మధ్య వయసున్న ఓటర్లే సగం మేర ఉన్నారు. ఇక 20 నుంచి 49 ఏళ్ల మధ్య వయసున్న వారే ఓటర్ల జాబితాలో.. మూడొంతులకు పైగా ఉన్నారు. మొదటి సారి ఓటుహక్కు పొందిన యువ ఓటర్లు 19వేల వరకు ఉన్నారు. వీరిలో రెండు జిల్లాల్లో కలిపి పురుష ఓటర్లు 10,615మంది ఉండగా, స్త్రీలు 8,398 మంది ఉండడం గమనార్హం. నేడు (శనివారం) జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రెండు జిల్లాలో వయస్సు వారీగా ఓటర్ల వివరాలు ఒకసారి పరిశీలిద్దాం.. - వరంగల్ డెస్క్



వరంగల్, హనుమకొండ జిల్లాల్లో 18 నుంచి 49 ఏళ్ల వయస్సు ఓటర్లు 8,61,665 మంది

జాతీయ ఓటర్ల దినోత్సవం ఎందుకంటే..

18 సంవత్సరాల వయసున్న కొత్త ఓటర్లు, ఎన్నికల్లో పాల్గొనడానికి, ఓటు హక్కు నమోదుకు తక్కువ ఆసక్తిని చూపిస్తున్నారని, వారి నమోదు స్థాయి పూర్తిగా తగ్గిపోవడంతో సమస్యను పరిష్కరించేందుకు 2011 జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవంగా ప్రకటించారు. ప్రతీ ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్ల వయస్సు వచ్చే అర్హతగల అందరినీ ఓటర్లుగా గుర్తించి ఓటుహక్కుపై, ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కలిగించేలా ఎన్నికల కమిషన్ కొన్ని ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నది.

ఓటర్ల తీరు ఇలా.. ▸

- వరంగల్, హనుమకొండ జిల్లాలో మొత్తం ఓటర్లు 12,81,203మంది ఉండగా 18నుంచి 39 ఏళ్ల వయస్సు ఓటర్లు 5,69,237 మంది ఉన్నారు.
- 18నుంచి 19 ఏళ్ల వయస్సు ఓటర్లలో యువకుల కంటే యువతులు ఓటు హక్కు తక్కువగా నమోదు చేసుకున్నారు. హనుమకొండ జిల్లాలో పురుషులు 3,835 మంది ఉండగా, స్త్రీలు 3,251 మంది, ఇతరులు ఒకరు ఉన్నారు. వరంగల్ జిల్లాలో పురుషులు 6,780 మందికాగా, స్త్రీలు 5,147 మంది, ఇతరులు ముగ్గురు ఉన్నారు.
- 18 నుంచి 49 ఏళ్ల వయస్సు వారు 8,61,665 మంది ఉండడం గమనార్హం. బరిలో నిలిచే అభ్యర్థి గెలుపులో వీరిది కీలకపాత్రగా చెప్పొచ్చు.
- కొత్తగా ఓటుహక్కు నమోదు చేసుకున్న వారు రెండు జిల్లాల్లో కలిపి 19,017 మంది ఉన్నారు. ఇందులో హనుమకొండలో 7,087 మంది ఉండగా, వరంగల్‌లో 11,930 మంది ఉన్నారు.
- 80 ఏళ్లకుపై బడిన ఓటర్లు 22,564 మంది ఉన్నారు. ఇందులో వరంగల్ జిల్లాలో 12,772 మంది ఉండగా.. హనుమకొండలో 9,792 మంది ఉన్నారు.

న్యూస్‌రీల్

28న జాబ్‌మేళా

హన్మకొండ అర్బన్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు ఈనెల 28న (సోమవారం) జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు హనుమకొండ జిల్లా ఉపాధి కల్పనా అధికారి ఎం.మల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాక్సిస్ బ్యాంక్ హైదరాబాద్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు 50 ఉన్నాయని పేర్కొన్నారు. వీటి భర్తీకి నగరంలోని ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ బాయ్స్ క్యాంపస్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 78933 94393 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నిధులు సకాలంలో వినియోగించుకోవాలి



విద్యారణ్యపురి: జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలలకు 2024–2025 విద్యాసంవత్సరానికి విడుదలైన నిధులను సక్రమంగా సకాలంలో ఖర్చు చేయాలని హనుమకొండ డీఈఓ డి.వాసంతి సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలను ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయంలో 19 పీఎంశ్రీ పాఠశాలల హెచ్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆమె పలు సూచనలు చేశారు. ఏయే పాఠశాలలకు ఏయే మేరకు అవసరాలకు నిధులు విడుదలయ్యాయో వివరించారు. సమావేశంలో క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, ప్లానింగ్ కో–ఆర్డినేటర్ బి.మహేష్, కమ్యూనిటీ మొబలైజింగ్ కో–ఆర్డినేటర్ బి.సుదర్శన్‌రెడ్డి, మధుసూదన్ పాల్గొన్నారు.

అటవీశాఖ పీసీసీఎఫ్ డోబ్రియల్ రాక

న్యూశాయంపేట: అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(పీసీసీఎఫ్) రాకేశ్ మోహన్ డోబ్రియల్ శుక్రవారం హనుమకొండ సుబేదారిలోని ఫారెస్ట్ కాంప్లెక్స్‌లోని కార్యాలయాన్ని సందర్శించారు. ములుగు జిల్లా మేడారంలో వచ్చేనెలలో జరగనున్న మినీ మేడారం జాతర ఏర్పాట్లపై జరిగే సమీక్ష సమావేశంలో పాల్గొనేందుకు వెళ్తూ మార్గమధ్యలోని సుబేదారి కార్యాలయానికి వచ్చారు. గెస్ట్‌హౌజ్‌లో అధికారులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం ములుగు జిల్లాకు బయల్దేరారు. ఆయన వెంట భద్రాద్రి జోన్, వరంగల్ సర్కిల్ సీపీఎఫ్ భీమానాయక్, హనుమకొండ, వరంగల్ జిల్లాల డీఎఫ్‌ఓలు బి.లావణ్య, అనూజ్ అగర్వాల్ ఉన్నారు.

ఎంసీఏ మూడో సెమిస్టర్ పరీక్షలు షురూ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంసీఏ మూడో సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కంప్యూటర్ సైన్స్‌విభాగం కేంద్రంలో పరీక్షల తీరుతెన్నులను పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆసింఇక్బాల్, విభాగాధిపతి డాక్టర్ రమ పరిశీలించారు.

నేటినుంచి పీజీ పరీక్షలు..

కాకతీయ యూనివర్సిటీ పరిధి ఉమ్మడివరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో పీజీ కోర్సుల ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ఎంటీఎం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంహెచ్ఆర్ఎం ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ తదితర కోర్సుల మూడో సెమిస్టర్ పరీక్షలు శనివారం నుంచి జరగనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ సౌజన్య శుక్రవారం తెలిపారు. ఈ నెల 25, 27, 29, 31, ఫిబ్రవరి 3, 5 తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

అప్రమత్తతే.. ఆర్థిక రక్ష



ఓటీపీలు చెప్పొద్దు.. లింకులు ఓపెన్ చేయొద్దు

- గోల్డెన్ అవర్‌తో డబ్బులు వెనక్కి తెవొచ్చు
- ప్రతీ ఒక్కరి దగ్గర ఉండాల్సిన నంబర్ 1930
- సందేహాలు నివృత్తి చేసిన సైబర్ క్రైం ఏసీపీ కూజా విజయ్‌కుమార్
- 'సాక్షి ఫోన్ ఇన్'కు స్పందన



వరంగల్ క్రైం: ఉమ్మడి వరంగల్ జిల్లాలో నిత్యం వందలాది మంది సైబర్ వలలో చిక్కుకుంటున్నారు. వారిలో కొందరు ధైర్యం చేసి పోలీసుల దృష్టికి తీసుకెళ్తుండగా.. చాలామంది అవగాహన లేక గమ్మున ఉండిపోతున్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కొత్త పంథాలో మోసం చేస్తున్న సైబర్ నేరగాళ్లకు చెక్ పెట్టేందుకు.. 'సాక్షి' ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైం ఏసీపీ కూజా విజయ్‌కుమార్‌తో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించింది. సైబర్ నేరగాళ్ల బాధితులు, ప్రజల సందేహాలను ఆయన నివృత్తి చేశారు.

ప్రశ్న: ఇటీవల చాలామంది బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం. వ్యవసాయ లోన్ మాఫీ అయ్యిందంటూ.. ఓటీపీ చెప్పమంటున్నారు?
– ఉదయ్‌కుమార్, చెన్నరావుపేట

ఏసీపీ: గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా సరే ఓటీపీ చెప్పమని అడిగితే చెప్పవద్దు. ఓటీపీ చెప్పిన మరుక్షణం మీ ఫోన్ అతడి చేతుల్లోకి వెళ్లిపోతుంది. అప్పుడు మీ బ్యాంకుల్లో డబ్బులన్నీ కాజేస్తాడు. ఢిల్లీ, జార్ఖండ్ రాజస్థాన్, అస్సాం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల నుంచి సైబర్ నేరగాళ్లు ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నారు.

ప్రశ్న: ఫోన్ పే, గుగూల్ పేలో చిరు వ్యాపారుల వద్ద సరుకులు కొని డబ్బులు ట్రాన్స్‌ఫర్ అయినట్లు చూపుతున్నారు.. కానీ అకౌంట్‌లో క్రెడిట్ కావట్లేదు ఎందుకని?
– రాజశేఖర్, నర్మెట

ఏసీపీ: ఇటీవల చాలా చోట్ల కనిపిస్తున్న సమస్య ఇది. చిరు వ్యాపారులు, వారు చూపించేది నమ్మకుండా మీ అకౌంట్‌లో డబ్బులు క్రెడిట్ అయ్యాయో లేదో చెక్‌చేసుకోవాలి.

ప్రశ్న: ఆన్‌లైన్‌లో రూ.1.20 లక్షలు కడితే.. రూ.3 లక్షలు వస్తాయని ఫోన్ చేసి ఆన్‌లైన్ వ్యాపారంపై చెబుతున్నారు. ఇలాంటివి నమ్మొచ్చా?
– వేణు శర్మ, పాలకుర్తి

ఏసీపీ: ఇలాంటి వాటిని మల్టీలెవల్ మార్కెటింగ్ మోసాలు అంటారు. ఇలాంటి ఆఫర్లను ఎట్టి పరిస్థితుల్లో నమ్మొద్దు.

ప్రశ్న: ఈఎంఐని లింక్‌లు ఇచ్చి కట్టమని చెప్పారు. కట్టిన తర్వాత బ్యాంకుకు వెళ్లి చూస్తే డ్యూ ఉంది. లింక్‌లు పంపిన ఫోన్ నంబర్‌కు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుంది. ఏం చేయమంటారు?
– రాజిరెడ్డి స్టేషన్‌ఘన్‌పూర్

ఏసీపీ: సైబర్ మోసాల్లో ఇదో రకం. ఈఎంఐ చెల్లించాలని మీకు పంపిన లింక్‌ను ఓపెన్ చేస్తే మీ ఫోన్ అతడి చేతికి పోతుంది. మీరు కట్టిన డబ్బులు మీరు రుణం తీసుకున్న బ్యాంకుకు కాకుండా అతడి అకౌంట్‌కి వెళ్లిపోయి ఉంటాయి. మీరు స్థానికంగా ఉన్న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి.

ప్రశ్న: గతేడాది ఓఎల్‌ఎక్స్ పేరిట నేను రూ.2 వేలు నష్టపోయా. వాటిని రికవరీ చేసుకునే అవకాశం ఉందా?
– నేతి సాయికుమార్, కొడకండ్ల

ఏసీపీ: సైబర్ నేరగాళ్ల చేతుల్లో ఎప్పుడు మోసపోయినా మొదటి గంట గోల్డెన్ అవర్. ఆ లోపు నేషనల్ సైబర్ టోల్ ఫ్రీ నంబర్ 1930కి ఫోన్ చేసి వివరాలు చెబితే ఆ డబ్బులను నేరగాళ్ల బ్యాంక్ నుంచి విత్‌డ్రా కాకుండా పుట్ ఆన్ హోల్డ్ చేయవచ్చు.

ప్రశ్న: మీరు ఓ వ్యక్తి రుణానికి నామినీగా ఉన్నారు? ఆ రుణం చెల్లించాలి.. లేదంటే కేసులు పెడతామని బెదిరిస్తున్నారు. ఏం చేయమంటారు?
– సుదర్శన్, పరకాల

ఏసీపీ: ఇవి ఆన్‌లైన్ ప్రైవేట్ ఫైనాన్స్ చేసే మోసాలు. మీకు తెలిసిన వ్యక్తి ఆన్‌లైన్‌లో రుణం తీసుకొని ఉంటాడు. అతడికి వచ్చే మేసేజ్‌లోని లింక్‌ను ఓపెన్ చేస్తే అతడి ఫోన్ హ్యాక్ చేసి అందులో ఉన్న కాంటాక్ట్ నంబర్లకు ఇలాంటి బెదిరింపు కాల్స్ చేసి డబ్బులు లాగుతారు. మీరు అలాంటి ఫోన్ కాల్స్‌కు భయపడాల్సిన అవసరం లేదు. వేధింపులు ఎక్కువైతే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి.

ప్రశ్న: నాకు తెలిసిన చాలామంది ఆన్‌లైన్‌లో మోసపోయారు. మోసం చేసిన వ్యక్తులు ఒకటి రెండు రోజులకే జైలు నుంచి బయటకు వస్తున్నారు? వారిపై కఠిన చర్యలు ఉండవా?
– ఎడ్ల శ్రీనివాస్, జనగామ

ఏసీపీ: ఆర్థికపరమైన నేరాల విషయాల్లో మోసం చేస్తే వాటికి సంబంధించి సెక్షన్లు బెయిలబుల్ సెక్షన్లు ఉన్నాయి. అందుకే మోసగాళ్లు తొందరగా బయటకు వస్తున్నారు. పదే పదే నేరాలకు పాల్పడే నిందితులపై పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తోంది. మన అప్రమత్తతే మనకు రక్ష.

ప్రశ్న: చట్టాలను కఠినతరం చేయలేరా?
– శ్రీకాంత్ జనగామ

ఏసీపీ: ప్రస్తుతం జరుగుతున్న సైబర్ మోసాలు చేసే నిందితులపై ఐటీ చీటింగ్ కేసులను నమోదు చేస్తున్నాం. చట్టంలో అదే ఉంది. ఆర్థిక నేరాలపై కఠిన శిక్షలు లేవు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైం విభాగం నుంచి సమాజంలో ఉన్న అన్ని వర్గాల ప్రజల్లో, విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తున్నాం. మహిళా సంఘాలు, ఎన్జీఓలతో కలిసి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. మనకు సైబర్ నేరాలపట్ల అవగాహన కలిగి ఉండాలి.

ప్రశ్న: గత డిసెంబర్‌లో రూ.1.50 లక్షలు ఆన్‌లైన్‌లో పోగొట్టుకున్నా. ఆ డబ్బులు తిరిగి వస్తాయా?
– ప్రతాప్, పాలకుర్తి

ఏసీపీ: ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్ (ఏపీకే) ఫైల్స్‌పై క్లిక్ చేయడం కారణంగా మీ డబ్బులు పోయాయి. మీరు డబ్బులు పోగొట్టుకున్న వెంటనే ట్రోల్ ఫ్రీ నంబర్ 1930కి ఫిర్యాదు చేసి ఉంటే మీ డబ్బులు వచ్చేవి. కానీ.. మీరు ఒక్క రోజు ఆలస్యంగా స్పందించారు. అయినప్పటికీ మీ ఫిర్యాదుపై కేసు నమోదైంది. దేశంలో ఆ నేరస్తుడు ఎక్కడ పట్టుబడినా మీ డబ్బులు వచ్చే అవకాశం ఉంది.

ప్రశ్న: పోలీసుల పేరిట ఫోన్‌చేసి బెదిరిస్తున్నారు. ఏం చేయమంటారు?
– శ్రీనివాస్, దేవరుప్పుల

ఏసీపీ: పోలీసులు ఎవరికీ ఫోన్ చేసి మీ పైన కేసులు నమోదయ్యాయని, మిమ్మల్ని అరెస్టు చేస్తున్నామని చెప్పరు. ఆన్‌లైన్‌లో అరెస్ట్ వారెంట్ చూపి బెదిరించరు. కాబట్టి అలాంటి కాల్స్‌కు భయపడొద్దు. ధైర్యంగా ఉండండి. ఫోన్ కాల్స్ ఎక్కువైతే స్థానికంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి.

బాలికలను ఎదగనివ్వాలి

- హెల్మెట్ ధరించి ప్రయాణించాలి
- మంత్రి కొండా సురేఖ



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, చిత్రంలో కలెక్టర్ సత్యశారద, మేయర్ సుధారాణి

ఖిలా వరంగల్: ఆడపిల్లలను సమాజంలో ఎదగనివ్వాలని, పురుషుడితో సమానంగా అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వాహనదారులు హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తే సురక్షితంగా గమ్యం చేరతారని సూచించారు. జాతీయ బాలికల దినోత్సవం–2025, జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం–2025 పురస్కరించుకుని శుక్రవారం వరంగల్ శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి సురేఖ మాట్లాడారు. ఆడపిల్లల లింగ నిష్పత్తిని కాపాడడం, వారికి విద్యను చేరువ చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని తీసుకొచ్చి పదేళ్లు పూర్తి చేసుకుందన్నారు. అర్ధరాత్రి ఆడపిల్ల స్వేచ్ఛగా తిరిగితేనే స్వాతంత్య్రం వచ్చినట్లని గాంధీ తెలిపారన్నారు. నేడు అమ్మాయిలకు భద్రత కరువైందని, వయస్సుతో సంబంధం లేకుండా అఘాయిత్యాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతోమంది నిండు ప్రాణాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అంతకుముందు కొండా సురేఖ ఆడపిల్లలను రక్షించాలని ప్రతిజ్ఞ చేయించారు. బేటీ బచావో బేటీ పడావో పోస్టర్‌ను ఆవిష్కరించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రశంసపత్రాలు అందజేశారు. అంతకుముందు బేటీ బచావో బేటీ పడావో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కార్పొరేటర్ పోశాల పద్మ, డీఆర్‌ఓ విజయలక్ష్మి, డీడబ్ల్యూఓ రాజమణి, డీఈఓ జ్ఞానేశ్వర్, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, ఎంవీఐ జయపాల్ రెడ్డి, శోభన్‌బాబు, బల్దియా అదనపు కమిషనర్ జోనా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు



మాట్లాడుతున్న హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య, చిత్రంలో ఎమ్మెల్యే నాయిని, మేయర్ సుధారాణి

హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య

హన్మకొండ: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శుక్రవారం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో జిల్లా మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం, బేటీ బచావో– బేటీ పడావో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాలను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ వివిధ పోటీ పరీక్షల్లో బాలికలదే అగ్రభాగమన్నారు. వీరిని మరింత ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారన్నారు. భ్రూణ హత్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ తల్లి ప్రేమ చాలా గొప్పదన్నారు. సమాజంలో ఏదైనా కలుషితం కావచ్చు కానీ ఒక్క తల్లి ప్రేమ మాత్రం ఎప్పుడూ కలుషితం కాలేదన్నారు. మేయర్ గుండు సుధారాణి, మహిళా శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి, డీఎంహెచ్‌ఓ అప్పయ్య, డీఈఓ వాసంతి ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జిల్లా స్థాయిలో వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను శాలువా కప్పి, ప్రశంసపత్రం అందించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా మహిళ సంక్షేమాధికారి జయంతి, రెడ్ క్రాస్ రాష్ట్ర ఈసీ మెంబర్ ఈవీ శ్రీనివాస్‌రావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి చర్యలు

హన్మకొండ అర్బన్: జిల్లాలో క్రీడాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో క్రీడల అభివృద్ధిపై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, 'కుడా' చైర్మన్ వెంకట్రాంరెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్‌లతో కలిసి వివిధ క్రీడా సంఘాల నాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేఎన్‌ఎస్‌లోని బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం, జిమ్నాస్టిక్ హాల్, స్విమ్మింగ్ పూల్ రిపేరింగ్ పనులు, మౌలిక వసతులపై చర్చించారు. కొత్తగా నిర్మిస్తున్న రెజ్లింగ్ హాల్, కబడ్డీ హాల్ పనులపై సమీక్షించారు. క్రీడా అవసరాలకు కావాల్సిన నిధులు తీసుకురావడానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో అథ్లెటిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వరద రాజేశ్వర్‌రావు, సారంగపాణి, రమేష్‌రెడ్డి, 'కుడా' అధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

ముగిసిన వార్డుసభలు

రేషన్‌కార్డులకు 27,979, ఇందిరమ్మ ఇళ్లకు 14,662 దరఖాస్తులు

వరంగల్ అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వార్డు సభలు జిల్లాలో శుక్రవారంతో ముగిశాయి. నాలుగు రోజులుగా జరిగిన డివిజన్లలో ప్రజలనుంచి పెద్దఎత్తున స్పందన లభించింది. చివరి రోజు రేషన్‌కార్డుల కోసం 2,897, ఇందిరమ్మ ఇళ్ల కోసం 1,891 మంది దరఖాస్తు చేసుకున్నారు. నగర వ్యాప్తంగా ఉన్న 66 డివిజన్ల నుంచి కొత్త రేషన్‌కార్డుల కోసం మొత్తం 27,979 మంది, ఇందిరమ్మ ఇళ్ల కోసం 14,662 మంది దరఖాస్తు చేసుకున్నట్లు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే వెల్లడించారు.

నిట్‌లో ద సేఫ్ సిస్టమ్‌పై చర్చ

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లోని సెమినార్ హాల్ కాంప్లెక్స్‌లో శుక్రవారం నిట్ వరంగల్, లండన్‌కు చెంది స్వీడన్ లుండ్ యూనివర్సిటీలు రోడ్డు భద్రతపై ద సేఫ్ సిస్టమ్ పేరిట చర్చ నిర్వహించారు. భారతదేశంలోని రహదారుల అభివృద్ధికి, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

పర్యాటక ఓరుగల్లు

- ఆధ్యాత్మిక.. ఆహ్లాద విహారం
- నేడు పర్యాటక దినోత్సవం



ఉరుకుల పరుగుల జీవితం నుంచి కాస్త విరామం కావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. ఏదైనా యాత్రకు వెళ్లాలంటే నాలుగైదు రోజుల సమయం కావాలి. ఖర్చు అధికంగానే ఉంటుంది. పిల్లలకు సెలవులు ఉండాలి. ఇవన్నీ సంవత్సరానికి ఒకసారే వీలవుతాయి. ఒకటి రెండు రోజులు సెలవులు దొరికినా చూసేందుకు ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు మన దగ్గరే ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వేయి స్తంభాలు, శ్రీభద్రకాళి దేవాలయాలు, మేడారం, రామప్ప, మంగపేట హేమాచలక్షేత్రం, ఆహ్లాదప్రాంతాలైన ఖిలావరంగల్ కోట, జూపార్క్, లక్నవరం, బొగత, బ్లాక్‌బెర్రీ తదితర ప్రాంతాలున్నాయి. నేడు జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలను ఒకసారి చూసొద్దాం..

- పూర్తి వివరాలు 10లో▸

హక్కులపై ఆడపిల్లలకు అవగాహన తప్పనిసరి

వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ నిర్మలా గీతాంబ



మాట్లాడుతున్న వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ

వరంగల్ లీగల్ : ఆడపిల్లలకు వారి హక్కులపై తప్పనిసరిగా అవగాహన ఉండాలని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ నిర్మలా గీతాంబ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శులు ఎం.సాయికుమార్, క్షమాదేశ్ పాండే ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కోర్టులోని న్యాయసేవా సదన్ బిల్డింగ్‌లో 'బాలికల విద్య, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, తదితర' అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మలా గీతాంబ మాట్లాడుతూ లింగ వివక్షను రూపుమాపడానికి, మహిళా సాధికారత కోసం సమాజంలోని బాలికలంతా విజ్ఞానవంతులై, చురుగ్గా వ్యవహరించాలని సూచించారు. బాలికలపై అత్యాచారాలు జరిగినా, వేధింపులకు గురైనా 1098, 100, 93919 07362 నంబర్లకు సమాచారం అందిస్తే తగు చర్యలు చేపడతారని సూచించారు. హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్.రమేశ్‌బాబు మాట్లాడుతూ.. బాలికా సంరక్షణ కోసం న్యాయసేవాధికార సంస్థలు కృషి చేస్తాయని, ఆడపిల్లలు ఎదుర్కొంటున్న అసమానతలను న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. డీసీపీ షేక్ సలీమా మాట్లాడుతూ గుడ్ టచ్ – బ్యాడ్ టచ్‌ల గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం వరంగల్ న్యాయసేవాధికార సంస్థ ద్వారా బాలలకు ఉచిత న్యాయ సహాయం కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా చిన్న పిల్లల అక్రమ రవాణా, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలకు సంబంధించిన లఘు చిత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ వసుధ, వరంగల్, హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు తీగల జీవన్‌గౌడ్, మాతంగి రమేశ్‌బాబు, షీ టీం, భరోసా, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ సుజాత, సువర్ణ, వెంకన్న, విద్యాశాఖ అధికారి సుభాష్ పాల్గొన్నారు.

పర్యాటక ఓరుగల్లు

నేడు జాతీయ పర్యాటక దినోత్సవం

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అనేక పర్యాటక ప్రదేశాలు, ప్రసిద్ధిగాంచిన ఆలయాలు, సరస్సులు, జలపాతాలు ఉన్నాయి. వాటిని చూసేందుకు రాష్ట్రం నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి పర్యాటకులు, భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. పర్యాటక ప్రాంతంగా ఉమ్మడి జిల్లా రోజురోజుకు అభివృద్ధి చెందుతోంది. ఈక్రమంలో సందర్శకుల నుంచి ఆదాయం సైతం వస్తోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి మరిన్ని సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేస్తే పర్యాటకం పరుగులెత్తనుంది. శనివారం జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.

న్యూశాయంపేట: వరంగల్ నగరంలోని కాకతీయ జూపార్కుకు ఇటీవల వచ్చిన జంతువులతో కొత్తకళ సంతరించుకుంది. ఇప్పుడున్న చిరుతలు, ఎలుగుబంటి, మొసళ్లు, నెమళ్లు, జింకలు, ఆస్ట్రిచ్, కొండెంగలు, నక్కలు, పక్షులతో పాటు కొత్తగా తీసుకొచ్చిన రెండు పెద్ద పులులు (శంకర్, కరీనా), అడవి దున్నలు, హగ్ డీర్, బార్కిన్ డీర్ (జింకలు) సందడి చేస్తున్నాయి. రాష్ట్రంలోనే హైదరాబాద్ జూపార్కు తర్వాత కాకతీయ జూపార్కు రెండో అతిపెద్దది. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు, కరీంనగర్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శిస్తుంటారు. మినీ జూపార్కుగా ఉన్న దీన్ని అటవీశాఖ మంత్రి కొండా సురేఖ చొరవతో మీడియం జూపార్కుగా అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. స్మార్ట్ సిటీ నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నారు. మూడేళ్లలో పార్కుకు వచ్చిన పర్యాటకులు, ఆదాయ వివరాలు ఇలా ఉన్నాయి.

సంవత్సరం	పర్యాటకుల సంఖ్య	వచ్చిన ఆదాయం
2022 – 23	2,91,802	1,16,96,010
2023 – 24	2,48,187	1,14,96,685
2024 – 25 జనవరి	1,80,811	88,44,725



సంవత్సరం	పర్యాటకుల సంఖ్య	ఆదాయం
2021 – 2022	68,645	రూ.20,20,500
2022 – 2023	57,281	రూ.22,92,160
2023 – 2024	61,873	రూ.24,73,665


పర్యాటకులను ఆకర్షిస్తున్న బొగత

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని చీకుపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న బొగత జలపాతం పర్యాటకులను ఆకర్షిస్తోంది. తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు గుట్టల మధ్య దండకారణ్యంలో సుమారు 50 కిలో మీటర్ల దూరంలో నల్లందేవి గుట్ట వద్ద పుట్టి, అక్కడ నుంచి ప్రవహిస్తూ చీకుపల్లి గ్రామ సమీపంలో బండలపై నుంచి జాలువారుతూ పరవళ్లు తొక్కుతోంది. జూన్ 20 నుంచి నవంబర్ వరకు జలపాతం కనువిందు చేస్తుంది. బొగత భద్రాచలం నుంచి 123 కిలో మీటర్లు, ఖమ్మం నుంచి 243, వరంగల్ నుంచి 123 కిలో మీటర్లు ఉంటుంది.

కాకతీయుల కళానైపుణ్యానికి ప్రతీక వేయిస్తంభాల దేవాలయం

హన్మకొండ కల్చరల్: దేశంలో ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా పేరొందిన వేయిస్తంభాల దేవాలయం వరంగల్‌కు 5 కిలోమీటర్ల దూరంలో హనుమకొండ నడిబొడ్డన ఉంది. చాళుక్యుల శైలిలో కాకతీయ వంశానికి చెందిన రుద్రదేవుడి పాలనలో నిర్మించారు. కాకతీయ సామ్రాజ్య కళాపిపాసకు, విశ్వబ్రాహ్మణ శిల్పుల పనితనానికి మచ్చుతునగా, భావితరాలకు వారసత్వంగా నిలుస్తోంది. కాకతీయుల శిల్పకళా శైలితో అలరారే ఈ త్రికుటాలయంలో నక్షత్రాకార పీఠంపై రుద్రేశ్వరుడు ప్రధాన అర్చమూర్తిగా లింగరూపంలో భక్తుల పాలిట కొంగు బంగారమై కొలువయ్యాడు. ప్రధానాలయం తూర్పునకు అభిముఖంగా అద్భుతమైన వాస్తుకళతో చూపరులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తోంది. ఆలయ మండపానికి ఉత్తరాభిముఖంలో నందీశ్వరుడి విగ్రహం నల్లరాతితో మలచబడి, కల్యాణ మండపానికి, ప్రధానాలయాలకు మధ్య దర్శనమిస్తోంది. మహాశివరాత్రి, కార్తీక పౌర్ణమి, గణేశ నవరాత్రుల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటోంది.

సంవత్సరం	ఆదాయం
2022 – 23	రూ.59,50,950
2023 – 24	రూ.64,81,550



అపురూప శిల్పకళా సంపద రామప్ప


వెంకటాపురం(ఎం): అపురూప శిల్పాకళా సంపదకు నిలయం.. ములుగు జిల్లాలోని రామప్ప దేవాలయం. వరంగల్ నుంచి సుమారు 65 కిలోమీటర్ల దూరంలో ఆలయం ఉంది. కాకతీయ చక్రవర్తి గణపతి దేవుడి సైన్యాధ్యక్షుడు రేచర్ల రుద్రుడు 1213వ సంవత్సరంలో రామప్ప దేవాలయాన్ని నిర్మించాడు. దేవాలయంలో శివలింగాన్ని (రుద్రేశ్వరుడు, రామలింగేశ్వరస్వామి) ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. ఇసుకనే పునాదిగా వాడి ఆలయాన్ని నిర్మించగా, నీటిలో తేలాడే ఇటుకలతో ఆలయ గోపురాన్ని నిర్మించడం మరో ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. గర్భగుడికి ఎదురుగా ఉన్న నందీశ్వరుడిలో జీవకళ ఉట్టిపడుతోంది.

సంవత్సరం	ఆదాయం
2021 – 22	రూ.27,56,770
2022 – 23	రూ.28,66,030
2023 – 24	రూ.35,54,532



ప్రకృతి ఒడిలో పాండవుల గుట్టలు

రేగొండ: జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రావులపల్లి శివారులోని పాండవుల గుట్టల చుట్టూ పచ్చని పొలాలు, ప్రకృతి అందాలు, జాలువారే జలపాతాలు, ప్రాచీన కాలం నాటి రాతి చిత్రాలు పర్యాటకుల ఆహ్లాదానికి చిరునామాగా మారాయి. పాండవుల గుట్టలు ఎక్కువగా సున్నపు రాళ్లతో, అవక్షేప శిలలతో ఏర్పడి ఒకదాని మీద మరొకటి పేర్చినట్లు కనువిందు చేస్తున్నాయి. ఎత్తైన బండరాళ్ల మధ్యలో, లోతైన లోయలు, నిల్చున్న కొండ ఆనవాళ్లు కనిపిస్తాయి.



కళా వైభవానికి దర్పణం కోటగుళ్లు

గణపురం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం పర్యాటం వైపు పరుగులెత్తుతోంది. గణపురం మండల కేంద్రంలో కాకతీయుల కళా వైభవానికి దర్పణం పట్టేలా నిర్మించిన కోటగుళ్ల (గణపేశ్వరాలయం)తో పాటు గణపసముద్రం చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయు. 1199 – 1260 మధ్య కాలంలో గణపురం సామంతుడైన గణపతి రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఆలయాన్ని గణపురం ఈశాన్యంలో మట్టి కోటల మధ్య నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. కాలక్రమేణా 16వ శతాబ్దం ప్రారంభంలో కులీకుతుబ్ ఉల్‌ముల్క్ అనే మహ్మదీయ రాజు ఈ ఆలయాన్ని ఫిరంగ్‌లతో పేల్చి ధ్వంసంచేశాడు. 15 ఏళ్ల నుంచి నిత్య పూజలతో వెలుగులోకి వచ్చింది.




మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మ

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారంలో రెండేళ్లకోసారి సమ్మక్క – సారలమ్మ మహాజాతరను పూజారులు ఘనంగా నిర్వహిస్తారు. ఏడాది మధ్యలో మినీ మేడారం జాతర జరుగుతుంది. 1996లో మేడారం గిరిజన జాతరను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తించింది. అప్పటి నుంచి మేడారానికి భక్తుల సంఖ్య భారీగా పెరిగింది. సమ్మక్క – సారలమ్మ పూజారులు సంప్రదాయంగా అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తారు. మేడారానికి వచ్చే భక్తుల్లో చాలామంది అడవుల్లో చెట్ల కింద వంటావార్పు చేసుకుని ప్రకృతిని ఆస్వాదిస్తారు. మేడారంలోని జంపన్నవాగు, చిలకలగుట్ట, సమ్మక్క జలధార, కంక వృక్షాలు భక్తులకు ఆకట్టుకుంటాయి. ఏటేటా మేడారానికి భక్తుల రద్దీ పెరుగుతోంది. అమ్మవార్ల దర్శనానికి వచ్చేవారు విందు, వినోదాలతో సందడి చేస్తారు. అభివృద్ధి చేస్తే పర్యాటకుల సంఖ్య మరింత పెరగనుంది.















సంవత్సరం	ఆదాయం
2022 – 23	9,95,24,978
2023 – 24	11,32,16,239

పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న భద్రకాళి దేవాలయం

ఓరుగల్లులో కొలువైఉన్న భద్రకాళి ఆలయం అత్యంత ప్రాచీనమైంది. వరంగల్, హనుమకొండ మధ్యలో భద్రకాళి సరస్సు, దాని పక్కన ఎత్తైన కొండపై ఉన్న ఒక పురాతన దేవాలయం ఇది. క్రీస్తు శకం 625లో భద్రకాళి ఆలయం నిర్మించగా, దుర్గమమైన భద్రకాళి గుట్టల్లో ఏకాండ శిలలో వెలిసిన అమ్మవారు మాత్రం అంతకంటే పూర్వనుంచే ఉన్నారు. భద్రకాళి ఆలయాన్ని 1950లో పునరుద్ధరించారు. ఈ ఆలయాన్ని అత్యంత ప్రసిద్ధి పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా చెప్పుకోవచ్చు. ప్రతీ సంవత్సరం లక్షలాది మంది భక్తులు సందర్శిస్తుంటారు. కాకతీయ రాజులు భద్రకాళి దేవిని తమ పితృదేవతగా కొలిచేవారు. భద్రకాళి సరస్సును కాకతీయులే నిర్మించారు. అమ్మవారు తొమ్మిదడుగుల ఎత్తు, తొమ్మిది అడుగుల వెడల్పు, ఎనిమిది చేతులతో దర్శనమిస్తున్నారు. ప్రతిరోజు 100టో కెన్లు, శుక్రవారం, ఆదివారాల్లో 200టోకెన్లు భక్తులకు అందజేస్తారు.

సజీవ సాక్ష్యాలు కాకతీయ కట్టడాలు

ఖిలా వరంగల్: చారిత్రక కట్టడాలు.. ప్రకృతి సౌందర్యాలు.. ఆధ్యాత్మిక కేంద్రాల కలయికే ఓరుగల్లు నగరం. కాకతీయుల కళారాజ్యంలో నాటి అందమైన అద్భుత శిల్పకళా ఖండాలతో పాటు పచ్చని పల్లెటూరు వాతావరణం పర్యాటక శోభకు అద్దం పడుతోంది. చారిత్రాత్మకంగా ప్రసిద్ధి చెందిన కాకతీయుల రాజధాని ఖిలా వరంగల్ కోట.. ప్రపంచ పర్యాటక కేంద్రంగా విలసిల్లుతోంది. కాకతీయుల శకం ముగిసి 800 ఏళ్లు గడుస్తున్నా నేటికీ చారిత్రక కట్టడాలు కళ్ల ముందు కదలాడుతున్నాయి. కోటలో స్వయంభూ శంభులింగేశ్వర స్వామి, నాలుగు కీర్తి తోరణాలు, ఖుష్‌మహల్, ఏకశిల గుట్టపై కట్టడాలు, శత్రుదుర్భేద్యమైన మట్టికోట, రాతికోటలు ఉన్నాయి. సుమారు రోజూ రూ.3వేల నుంచి రూ.5వేల వరకు ఆదాయం వస్తోంది. ఏడాదికి సుమారు రూ.7లక్షలకు పైగా ఆదాయం సమకూరుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

పాకాల అందాలు అదరహో

సంవత్సరం	పర్యాటకుల సంఖ్య	ఆదాయం
2022	40,634	రూ.12,21,210
2023	41,297	రూ.17,95,470
2024	41,453	రూ.17,96,860

ఖానాపురం: పర్యాటక ప్రాంతాల్లో పాకాలకు ప్రత్యేక స్థానం. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పాకాలకు ఉమ్మడి జిల్లాతో పాటు హైదరాబాద్, ఖమ్మం, ఇతర ప్రాంతాలను నుంచి పర్యాటకులు నిత్యం తరలివస్తుంటారు. కట్టపై నుంచి సరస్సు అందాలతో పాటు జలసవ్వడిని ఆస్వాదిస్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పాకాల సరస్సు మీదుగా సూర్యచంద్రుల ప్రతిబింబాలు పర్యాటకులను కనువిందు చేస్తుంటాయి. గతంలో బోటింగ్ నిలిచిపోగా ప్రస్తుతం బోటింగ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. నైట్‌క్యాంపింగ్, వాచ్‌టవర్ల ఏర్పాటుతో పర్యాటకులు సరస్సు, పాకాల అందాలను వీక్షిస్తూ అద్భుతమంటూ కితాబిస్తున్నారు.

టూరిస్ట్ పిక్నిక్ స్పాట్ లక్నవరం

సంవత్సరం	పర్యాటకులు
2022	5 లక్షలు
2023	7 లక్షలు
2024	9 లక్షలు


గోవింద రావుపేట: ములుగు జిల్లా గోవింద రావుపేట మండలంలోని బుస్సాపూర్ గ్రామ సమీపంలో లక్నవరం సరస్సు ఉంది. ఇది ప్రసిద్ధిగాంచిన టూరిస్ట్ పిక్నిక్ ప్రదేశం. మూడు ఇరుకైన లోయలను సిమెంట్ కట్టడాలతో మూసివేయడం వలన ఈ సరస్సు ఏర్పడింది. ఈ సరస్సును 13వ శతాబ్దంలో కాకతీయ రాజవంశం పాలకులు నిర్మించారు. ఈ ప్రాంతం మొత్తం పచ్చని పంటలు, ఆహ్లాదకరమైన నీటి వనరులతో కళకళలాడుతూ ఉంటుంది. అదనపు ఆకర్షణగా సస్పెన్షన్ వంతెనలు నిర్మించారు. లక్నవరం సరస్సుకు వెళ్లే దారిలోనే అటవీ ఉద్యానవనం జింకల పార్కు ఉంది. ట్రెక్కింగ్ ద్వారా అడవిని చూడొచ్చు.

అందాల బ్లాక్ బెర్రీ ఐలాండ్

ఎస్ఎస్‌తాడ్వాయి: ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని ఏటూరునాగారం వైపు వెళ్లే జాతీయ రహదారిని ఆనుకుని జలగలంచ అటవీ ప్రాంతంలో బ్లాక్ బెర్రీ ఐలాండ్ ఉంది. చుట్టూ దట్టమైన అటవీప్రాంతం మధ్యలో ఎడారిలా బ్లాక్ బెర్రీ ఐలాండ్ కొలువైంది. ఇసుక మేటలతో ఐదెకరాల విస్తీర్ణంలో ఉన్న ఐలాండ్ చుట్టూ వాగు ప్రవహిస్తోంది. బ్లాక్‌బెర్రీ దీవి ఐలాండ్ పర్యాటకులకు ఆకర్షిస్తోంది. పర్యాటకులు రాత్రి వేళలో బస చేసేందుకు 50 గుడారాలు ఏర్పాటు చేశారు. అలాగే, రెస్టారెంట్ కూడా ఉంది. రాత్రిపూట చలిమంటలు, సోలార్ విద్యుత్ సదుపాయం కల్పించారు. ఐలాండ్‌ను మొత్తం వీక్షించేందుకు వాచ్ టవర్ కూడా ఉంది. బ్లాక్ బెర్రీ ఐలాండ్ సందర్శన కోసం ఆన్‌లైన్ బుకింగ్‌ను ప్రారంభించారు.

రెండో యాదగిరి గుట్ట.. హేమాచల క్షేత్రం

మంగపేట: అడవితల్లి ఒడిలో నెలవై రెండో యాదగిరి గుట్టగా ప్రసిద్ధిగాంచిన హేమాచల లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం 5వ శతాబ్దంలో ఏర్పడినట్లు చరిత్ర చెబుతోంది. ప్రకృతి ప్రసాదంగా వెలిసిన ఈ దైవక్షేత్రంలో స్వయంభూ లక్ష్మీనర్సింహుడిని దర్శించుకునేందుకు సమీప రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. అంతటి విశిష్టత కలిగిన ఈ ఆలయం వరంగల్‌కు సుమారు 134 కిలోమీటర్ల దూరంలో ములుగు జిల్లా మల్లూరు గుట్టపై ఉంది. ఆరున్నర అడుగుల ఎత్తుగల స్వామివారి విగ్రహాన్ని గుహలో నుంచి తొలుస్తున్న క్రమంలో స్వామివారి నాభిలో గడ్డపార గుచ్చుకోగా, నాభి నుంచి నేటికీ చీము వంటి ద్రవం స్రవిస్తోందని అర్చకులు చెబుతున్నారు. ఆ ద్రవాన్ని మంచి చందనంతో కలిపి నాభి చందన ప్రసాదంగా భక్తులకు ఇస్తుంటారు. ఆలయ సమీపంలో ప్రకృతి సిద్ధంగా వెలిసిన కోనేరు, చింతామణి జలపాతం ఆలయానికి వచ్చే భక్తుల దాహార్తిని తీరుస్తోంది.



జేఈఈ మెయిన్స్‌కు 61మంది గైర్హాజరు

విద్యారణ్యపురి: దేశంలో ప్రతిష్టాత్మకమైన ఐఐటీ, నిట్‌లలో ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు జేఈఈ మెయిన్స్ ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం హనుమకొండ, వరంగల్‌లోని 5 పరీక్ష కేంద్రాల్లో రెండు సెషన్లలో 61మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగిన మొదటి సెషన్‌లో 1,221 మంది అభ్యర్థులకు 1,186 మంది హాజరుకాగా, రెండో సెషన్ మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు జరిగిన పరీక్షకు 1,085మంది అభ్యర్థులకు 1,059మంది అభ్యర్థులు హాజరయ్యారని సిటీ కోఆర్డినేటర్ శ్రీలతారెడ్డి వివరించారు.

డ్రైవర్ వృత్తి గొప్పది

● ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం డి.విజయభాను



డిపోలో డ్రైవర్‌ను సన్మానిస్తున్న ఆర్ఎం డి.విజయభాను

హన్మకొండ: డ్రైవర్ వృత్తి చాలా గొప్పదని ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయ భాను అన్నారు. శుక్రవారం హనుమకొండలోని వరంగల్–1 డిపోలో డ్రైవర్స్ డేను జరుపుకున్నారు. డ్రైవర్లకు ఆర్టీసీ ఆర్ఎం. విజయ భాను, అధికారులు పూలు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ వాహనం నడుపుతున్న ప్రతి ఒక్కరూ డ్రైవరే అన్నారు. ఇందులో బేధాభిప్రాయాలకు తావు లేదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) కేశరాజు భాను కిరణ్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెకానికల్) ఎం.మాధవరావు, డిపో మేనేజర్‌లు వంగల మోహన్ రావు, బి.ధరమ్ సింగ్, సూపర్ వైజర్లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరస్తుడికి యావజ్జీవ కారాగార శిక్ష

వరంగల్ లీగల్: వరంగల్ నగరంలోని శివసాయి మందిరం పూజారి సత్యనారాయణ శర్మ హత్యకేసులో నేరస్తుడు సయ్యద్ నాదిక్ హుస్సేన్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ.నిర్మలా గీతాంబ శుక్రవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2018, అక్టోబర్ 26 ఉదయం 5.30గంటలకు పోచమ్మ మైదాన్ సెంటర్‌లోని శివసాయి మందిరం పూజారి సత్యనారాయణ శర్మ హారతి కార్యక్రమాన్ని మైక్ ద్వారా వినిపిస్తుండగా సయ్యద్ నాదిక్ హుస్సేన్ అక్కడికి వచ్చి తమకు అసౌకర్యంగా ఉందని, మైక్ ఎందుకు పెట్టావని అకారణంగా పూజారిపై దాడిచేసి గాయపర్చాడు. తీవ్ర గాయాల పాలై రక్తపు మడుగులో ఉన్న సత్యనారాయణ శర్మను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ నాలుగు రోజుల అనంతరం పూజారి మృతి చెందారు. ఈ ఘటనపై మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా, నాటి ఇన్‌స్పెక్టర్ జీవన్‌రెడ్డి పరిశోధన చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. 30 మంది సాక్షుల సాక్ష్యాధారాలను కోర్టు విచారించి నేరం రుజువు కావడంతో నేరస్తుడు సయ్యద్ హుస్సేన్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ జడ్జి నిర్మలా గీతాంబ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో ప్రత్యేక ప్రాసిక్యూటర్ మోకాళ్ల సత్యనారాయణ, జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ ప్రాసిక్యూషన్ పక్షాన వాదించారు. లైజన్ ఆఫీసర్ హరికృష్ణ పర్యవేక్షణలో సాక్షులను కానిస్టేబుళ్లు దాడి శ్రీనివాస్, రఘు కోర్టులో ప్రవేశపెట్టారు.

భక్తులు మెచ్చుకునేలా ఏర్పాట్లు చేయాలి

● మేడారం మినీజాతర ఏర్పాట్లపై మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ధనసరి సీతక్క, పక్కన మంత్రి సురేఖ, ఎంపీ, తదితరులు

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క, సాలరమ్మ మినీ జాతరలో భక్తులు మెచ్చుకునేలా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వచ్చేనెల 12 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న మినీ జాతర ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులతో మేడారంలోని ఐటీడీఏ అతిథి గృహంలో సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. మంత్రి కొండా సురేఖతో పాటు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క, ఎంపీ బలరాంనాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ దివాకర్ టీఎస్, ఎస్పీ డాక్టర్ శబరీశ్, ఐటీడీఏ పీఓ చిత్రా మిశ్రా, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్, డీఎఫ్ఓ కిషన్ రాహుల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ ఏర్పాట్లను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ మినీ జాతరతో పాటు 2026లో జరగనున్న మహాజాతర నాటికి శాశ్వత పనుల కోసం రూ.50 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు. కొండాయి బ్రిడ్జి కోసం గతంలో రూ.9 కోట్ల నిధులు మంజూరు చేశామని, ఇంజనీరింగ్ అధికారులు మరో రూ.16 కోట్ల అంచనా పెంచారని, త్వరలో నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఫిబ్రవరి 4వ తేదీన మళ్లీ జాతర పనులపై సమీక్ష నిర్వహిస్తానని పేర్కొన్నారు.

శాఖల వారీగా సమీక్ష

ఆర్‌డబ్ల్యూఎస్, శానిటేషన్, విద్యుత్, ఇరిగేషన్, వైద్య, పీఆర్ శాఖల అధికారుల ఏర్పాట్లపై ప్రధానంగా సమీక్షించారు. జాతరలో నాలుగు రోజుల పాటు జంపన్నవాగులో భక్తుల స్నానాల కోసం నీటి పరిస్థితిని ఇరిగేషన్ శాఖ అధికారులను మంత్రులు అడగగా పడిగాపూర్ చెక్‌డ్యాం నుంచి నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జాతరలో చేపట్టాల్సిన బందోబస్తు, భద్రత ఏర్పాట్లను మంత్రులకు జిల్లా ఎస్పీ శబరీష్ వివరించారు. తాగునీటి ఏర్పాట్లను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వివరించారు. సమావేశానికి ముందు మంత్రులు సురేఖ, సీతక్క, ఎంపీ బలరాం నాయక్.. అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమావేశంలో డీఎంహెచ్ఓ గోపాల్‌రావు, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, ఈఓ రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, అధికారులు పాల్గొన్నారు.

కొండాయి బ్రిడ్జిని త్వరలోనే ప్రారంభిస్తాం

● ఆర్‌అండ్‌బీ డీఈఈ రఘువీర్

సాక్షి ఎఫెక్ట్..

ఏటూరునాగారం: మండలంలోని కొండాయి – దొడ్ల మధ్యలో ఉన్న నూతన బ్రిడ్జి పనులను త్వరలోనే ప్రారంభిస్తామని ఆర్‌అండ్‌బీ డీఈఈ రఘువీర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21వ తేదీన సాక్షిలో వచ్చిన కొండాయి బ్రిడ్జికి మోక్షం ఎప్పుడో? అనే కథనంపై అధికారులు స్పందించారు. వరదలకు గతంలో వేసిన బ్రిడ్జి కొట్టుకుపోయిందని పేర్కొన్నారు. లోలెవల్‌లో కాకుండా హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి డిజైన్ చేయించడంతో ఆలస్యంగా అయిందని తెలిపారు. ఫిబ్రవరిలో పనులు ప్రారంభించి వర్షాకాలంలోపు పూర్తయ్యేలా చూస్తామని పేర్కొన్నారు. మేడారం జంపన్నవాగుపై నిర్మించిన నమూనా లాంటిదే ఇక్కడ కూడా నిర్మించాలని మంత్రి సీతక్క ఆదేశించారని గుర్తుచేశారు. ఆ దిశగా చర్యలు చేపడుతున్నాం.

పరిహారం చెల్లింపులో జాప్యం ఎందుకు?

● నష్టపరిహారం ఇవ్వకపోవడం వల్ల రైతు ఆత్మహత్య
● ఆర్డీఓకు ఎమ్మెల్యే నాగరాజు ఫోన్



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు

హసన్‌పర్తి: జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లింపులో జాప్యమెందుకు జరుగుతోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు ప్రశ్నించారు. భూమి కోల్పోయిన రైతు గొర్రె సారయ్యకు నష్టపరిహారం అందకపోవడం వల్ల ఆత్మహత్య చేసుకున్నాడని శుక్రవారం ఫోన్‌లో ఆర్డీఓతో మాట్లాడారు. భూమి సేకరించి నాలుగేళ్లు అవుతున్న నష్టపరిహారం ఎందుకు ఇవ్వలేదని అడిగితెలుసుకున్నారు. జాప్యానికి గల కారణాలు చెప్పాలని ఆదేశించారు. అంతకుముందు గొర్రె సారయ్య కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. మృతుడి కుమారుడు, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్రె కిరణ్‌కుమార్‌ను ఓదార్చారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్డీఓతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. త్వరలో పరిహారం అందేలా చర్యలుచేపట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఉదయ్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు కిరణ్, ఆరెల్లి వెంకటస్వామి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ మధన్, విజయ్, దేవస్థాన మాజీచైర్మన్ జె.రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.